

మైనర్‌కు బండి.. 'మేజర్' మిస్టేక్

పిల్లలకు వాహనాలిస్తే ఇక తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పవు. మైనర్లు వాహనాలు నడుపుతూ రోడ్డెక్కితే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. - 8లో▸



డిజిటల్ టెక్నాలజీతో పెనుమార్పులు

సేవా, వ్యవసాయ పరిశ్రమల రంగాల్లో డిజిటల్ టెక్నాలజీతో పెను మార్పులు వచ్చాయని ఆచార్య మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35.0°/23.0°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దేవాలయ స్థలాలపై సర్వే



వరంగల్ చౌరస్తా: అన్యాక్రాంతమైన వరంగల్ గోవిందరాజుల గుట్ట దేవాలయ భూమిని వరంగల్ రెవెన్యూ, సర్వే ల్యాండ్ సిబ్బంది బుధవారం సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 15/1లో 6 ఎకరాలు ఉన్నట్లు సమాచారం. దేవాలయం భూమిలో పలు వ్యాపార, వాణిజ్య, నివాసాలుగా వెలిసినట్లు సర్వేలో తేలింది. ఆక్రమిత కొన్ని ఇళ్లు, షాపులకు రెవెన్యూ సిబ్బంది మార్కింగ్ చేశారు. కార్యక్రమంలో ఈఓ రత్నాకర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే క్రీడా శిక్షణ శిబిరాల్లో దరఖాస్తుల స్వీకరణ గడువు మరో మూడు రోజులు పొడిగించినట్లు డీవైఎస్‌ఓ అశోక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న బాలబాలికలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు సీనియర్ క్రీడాకారులు, పీఈటీ, పీడీలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వీరు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5గంటలలోపు హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నేడు నిట్‌లో నిధి ఆప్‌కే నికత్

హన్మకొండ: ఈపీఎఫ్‌ఓ ఫిర్యాదులు పరిష్కరించడానికి కాజీపేట నిట్‌లో గురువారం 'నిధి ఆప్‌కే నికత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వరంగల్ రీజినల్ పీఎఫ్ కమిషనర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఈపీఎఫ్‌ఓ సభ్యులు, యజమానులు, పెన్షనర్లు పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

కమిషనరేట్‌లో ఇన్‌స్పెక్టర్ బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీసీఆర్‌బీలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న కరుణాకర్‌ను కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేస్తూ మల్టీజోనల్ వన్ ఐజీ చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకటి రెండు రోజుల్లో ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ కమిషనరేట్ నుంచి రిలీవ్ కానున్నారు.

రేపు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు ఈ నెల 28న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ రావు తెలిపారు. ప్రయాణికులు శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 85003 46902 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

పండితులకు సత్కారం



హన్మకొండ కల్చరల్: శ్రీశంకరభగవత్పాదుల, శ్రీభగవద్రామనుజుల జయంతిని పురస్కరించుకుని వరంగల్ ధన్వంతరీ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి హనుమకొండలోని చిన్నకొవెలలో పండిత సత్కారం ఘనంగా జరిగింది. సమితి వ్యవస్థాపకులు గుడిమెళ్ల విజయకుమారాచార్యుల అధ్వర్యంలో సేవాకాలం, అర్చన జరిగాయి. అనంతరం పండితులు గంగు ఉపేంద్రశర్మ, చెరుకుపల్లి శ్రీనివాసాచార్యులను సత్కరించారు. కార్యక్రమంలో అయినవోలు వెంకట సత్యమోహన్, వెంకట సత్యమోహన్, జగన్నాధాచార్యులు, జీవీఎస్ శ్రీనివాసచార్యులు, చిమిరాల శ్రీధరాచార్యులు, సముద్రాల శశిధరాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

'స్వలింగ సంపర్కం చట్టబద్ధం చేయొద్దు'

వరంగల్ లీగల్: స్వలింగ సంపర్కం చట్టబద్ధం చేయకూడదని జిల్లా కోర్టు మహిళా న్యాయవాదులు డిమాండ్ చేశారు. దీనిపై వారి అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ బుధవారం ఇరు జిల్లా ప్రధాన న్యాయమూర్తులకు వినతిపత్రం అందజేశారు. స్వలింగ సంపర్కుల హక్కులు, వారి భద్రత గురించి ప్రభుత్వాలు అనే పథకాలు అమలు చేస్తున్నాయని, వారి విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు కార్యక్రమంలో హనుమకొండ బార్ అసోసియేషన్ కోశాధికారి బి.అండాలు, వరంగల్ బార్ అసోసియేషన్ మహిళా కార్యదర్శి ఆడెపు కవిత, పద్మలత గౌడ్, అరుణ, రజిని, ఎం.కవిత పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్!

క్లస్టర్ల వారీగా దరఖాస్తుల పరిశీలన ప్రారంభం

- పక్షం రోజుల్లో ప్రాథమిక పరిశీలన పూర్తి
- 50మంది సైట్ ఇంజనీర్లు కావాలని లేఖ
- గ్రేటర్ వరంగల్‌కు భారీగా ఆదాయం సమకూరే అవకాశం



వరంగల్ అర్బన్: దాదాపుగా మూడున్నర ఏళ్ల తర్వాత అనధికార ప్లాట్లు, అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర పురపాలక శాఖ ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలతో పక్షం రోజులుగా దరఖాస్తులపై గ్రేటర్ వరంగల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది దృష్టి కేంద్రీకరించారు. రెండు నెలల్లో స్థలాల వెరిఫికేషన్, పరిష్కరించేలా ముందుకు సాగుతున్నారు. 2019లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళనలు చేపట్టాయి. ఇంతకాలం పక్కన పెట్టిన ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించి, నిధులు సమాకూర్చుకోవాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో నగరాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులకు ముమ్మరంగా చేపట్టాలని, ఇందుకు నిధులు అవసరం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గ్రేటర్ వరంగల్ వ్యాప్తంగా స్థలాల క్రమబద్ధీకరణతో రూ.55కోట్ల మేరకు ఆదాయం సమాకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలోని గ్రేటర్ వరంగల్ మినహా ఇతర గ్రామాల్లోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సైతం పరిష్కరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

98వేల దరఖాస్తులు

గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్ల నుంచి 98 వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు నమోదయ్యాయి. స్థలాల యజమానులు ఎక్కువ మొత్తంలో రూ.1,000, తక్కువ సంఖ్యలో రూ.10,000 చొప్పున చెల్లించి 'ఆన్‌లైన్'లో దరఖాస్తు చేసుకున్నారు. వీటిని రెవెన్యూ గ్రామం, సర్వేనంబర్ల ఆధారంగా క్లస్టర్ల వారీగా విభజిస్తున్నారు. ప్రస్తుతం బల్దియాలో 10 మంది టీపీబీఓలు, టీపీఎస్‌లు ఉండగా, వీరికి ఒక్కొక్కరికి 9వేల నుంచి 10వేల వరకు దరఖాస్తులను అప్పగించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయించనున్నారు. మొత్తం దరఖాస్తుల్లో 60వేల వరకు అర్హత సాధించే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు. అంతేకాకుండా 15 వేల నుంచి 20 వరకు దరఖాస్తుదారులు ఇప్పటికే ఎల్ఆర్ఎస్ సర్‌చార్జీలు చెల్లించి పర్మిషన్లు కూడా పొందినట్లు పేర్కొంటున్నారు.

సైట్ ఇంజనీర్లు కావలెను!

బల్దియాలో టీపీబీఓలు 12 మంది, ఏసీపీలు ఆరుగురు, ఒక డీసీపీ, ఒక సీపీ మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది, అధికారులతో దరఖాస్తుల పరిష్కారం సాధ్యం కాదని తేల్చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక ఏజెన్సీకి రెండు రోజుల కిందట లేఖ రాశారు. 50 మంది గ్రాడ్యుయేషన్ కలిగి ఉన్న సైట్ ఇంజనీర్లు కావాలని ఆహ్వానించారు. దరఖాస్తుల ద్వారా అందిన సొమ్ములో భాగస్వామ్యమైన ఏజెన్సీ ద్వారా ఆ సైట్ ఇంజనీర్లకు కొంత సొమ్ము అందజేస్తామని పేర్కొన్నారు.

స్థల యజమానుల మొబైల్ ఫోన్‌లకు సమాచారం

ఎల్ఆర్ఎస్ అర్హత కలిగిన సంబంధిత స్థల యజమానులకు మొబైల్ ఫోన్‌లకు సంక్షిప్త సమాచారం ఇస్తారు. ఈ - మెయిల్ ద్వారా ఫీజును తెలియజేయడంతోపాటు మాన్యువల్‌గా కూడా ఒక కాపీని అప్పగించాలని నిర్ణయించారు. డాక్యుమెంట్లు, ఎన్ఓసీలు, ఫీజు 'ఆన్‌లైన్'లో చెల్లిస్తే ఉత్తర్వులు కూడా 'ఆన్‌లైన్'లోనే జారీ అవుతాయి. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. స్థలాల క్రమబద్ధీకరణ మార్కెట్ విలువ ప్రకారం ఫీజు నిర్ణయిస్తారు. రిజిస్ట్రేషన్ శాఖ ఖరారు చేసిన మార్కెట్ విలువ ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.



నగరంలోని అనధికార స్థలాలు

వీటికి నో...

- ప్రభుత్వ భూమి, పబ్లిక్ స్థలాలు, యాజమాన్యపు హక్కు పత్రాలు లేని నిర్మాణాలకు.
- ప్రభుత్వ యూఎల్‌సీ భూముల్లో, అగ్రికల్చర్ సీలింగ్ ల్యాండ్‌కు ఇవ్వరు.
- వివాదాస్పద స్థలాలు, పార్కింగ్, మాస్టర్‌ప్లాన్ ల్యాండ్ యూజ్ నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే నిరాకరిస్తారు.
- చెరువులు, నాలాల స్థలాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లకు వర్తించదు.

ఇలా చేస్తారు..

- రెవెన్యూ గ్రామ సర్వేనంబర్ల ఆధారంగా దరఖాస్తులను పరిశీలిస్తారు.
- 300 స్వేర్‌మీటర్ల లోపు స్థలాలను టీపీబీఓలు తనిఖీ చేస్తారు.
- 300 స్వేర్ మీటర్లు దాటితే టీపీబీఓలు, ఏసీపీ పరిశీలిస్తారు.
- స్థలాల క్రమబద్ధీకరణ కోసం 3 విభాగాల్లో లాగిన్లు కేటాయిస్తున్నారు.
- 12 మంది టీపీబీఓలు ఎల్-1, ఆరుగురు ఏసీపీలకు ఎల్-2 లాగిన్లు కేటాయించారు.
- త్వరలో కమిషనర్ లేదా డిప్యూటీ కమిషనర్లకు ఎల్-3 లాగిన్లు ఇచ్చే అవకాశం ఉంది.

ఆరోగ్య కార్యక్రమాల అమలును సమీక్షించాలి

- హనుమకొండ డీఎంహెచ్‌ఓ సాంబశివరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సాంబశివరావు

ఎంజీఎం: వైద్యాధికారులు తమ పరిధిలోని అన్ని ఆరోగ్య కార్యక్రమాల అమలును ఎప్పటికప్పుడు సమీక్షించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు ఆదేశించారు. ప్రపంచ వ్యాధి నిరోధక టీకాల వారోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలకు, విద్యార్థులకు, పెద్దవారికి అందుబాటులో ఉన్న వ్యాక్సిన్‌ల గురించి, వాటి వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. ప్రతి గర్భిణిని మొదటి త్రైమాసికంలోనే నమోదు చేయాలని, మూడవ, నాల్గవ చెకప్‌లు తప్పనిసరిగా ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో జరిగేలా చూడాలన్నారు. అనంతరం పలు అంశాల పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్ పాషా, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వాణిశ్రీ, ఉమాశ్రీ, గీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అపర్ణ నర్సింహోం తనిఖీ

హనుమకొండలోని అపర్ణ నర్సింగ్ హోంను బుధవారం డీఎంహెచ్‌ఓ సాంబశివరావు.. వైద్యాధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి గర్భిణి పూర్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, సాధారణ ప్రసవాలను ఎక్కువగా జరిగేలా చూడాలని సూచించారు. పీసీఅండ్‌పీఎన్‌డీటీ, ఎంటీపీ చట్టం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

భద్రకాళి, భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి దేవాలయంలో శ్రీభద్రకాళిభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం అమ్మవారిని సూర్యప్రభవాహనం పై, సాయంత్రం హంసవాహనంపై ఊరేగించారు. ఆలయప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం నుంచి నిత్యాహ్నికం జరిపి అనంతరం చతుస్థానార్చన సదస్యం నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు వరంగల్ ఉమ్మడి జిల్లాల పద్మశాలి సంఘం నాయకులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, నగర మేయర్ గుండు సుధారాణి దంపతులు పాల్గొన్నారు. కేంద్ర ఖాదీ ఇండస్ట్రియల్ బోర్డు మాజీ డైరెక్టర్ ఈగ మల్లేషం పాల్గొని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. నాయీబ్రాహ్మణ ప్రముఖులు పాల్గొని ప్రసాద వితరణ చేశారు.



అమ్మవారి సన్నిధిలో గుండు ప్రభాకర్, సుధారాణి దంపతులు, ఈగ మల్లేషం

కేయూలో నేడు మాక్ పీఆర్ టీంల తనిఖీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ (న్యాక్) పీఆర్ టీం వచ్చేనెల 25, 26, 27 తేదీల్లో పర్యటించనుంది. ఈ నేపథ్యంలో అన్ని విభాగాల్లో న్యాక్‌కు ఎలా ప్రిపేర్ అయ్యారో ముందస్తుగా తెలుసుకునేందుకు మాక్ పీఆర్‌టీంగా నాలుగు బృందాలను వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు ఏర్పాటు చేశారు. గురువారం టీంలు క్యాంపస్‌లోని అన్ని విభాగాలను సందర్శించి తనిఖీ చేస్తాయి. యూనివర్సిటీ ఐక్యూ ఏసీ సెల్ ద్వారా న్యాక్ రీ అక్రిడిటేషన్ కోసం పంపిన ఎస్ఎస్ఆర్‌లో పేర్కొన్న విధంగా డాక్యుమెంట్లు, ఇతర అంశాలు ఆయా విభాగాల్లో ఉన్నాయా లేదా అనేది పరిశీలిస్తాయి. ఏయే విభాగాలకు ఎవరెవరు వస్తున్నారో బుధవారం రాత్రి 10గంటల ప్రాంతంలో అన్ని విభాగాల అధిపతులకు, అధ్యాపకులకు సమాచారమిచ్చారు. సాయంత్రం సెనెట్‌హాల్‌లో సమావేశమై టీంలు తమ ఫీడ్‌బ్యాక్‌ను వీసీ రమేష్‌కు తెలియజేస్తాయి.

రూ.98,27,129లతో జిల్లా ప్రణాళిక

- 42 పనులకు జిల్లా ప్రణాళిక కమిటీ ఆమోదం

హన్మకొండ: హనుమకొండ (పాత వరంగల్ అర్బన్) జిల్లాలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల ప్రణాళికను జిల్లా పంచాయత్ ప్రణాళిక కమిటీ ఆమోదం తెలిపింది. బుధవారం హనుమకొండ జెడ్పీలోని తన చాంబర్‌లో చైర్మన్ సుధీర్‌కుమార్ అధ్యక్షతన జిల్లా పంచాయత్ ప్రణాళిక కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో 15వ ఆర్థిక సంఘం నిధులు ఏ మేరకు జిల్లాకు రానున్నాయో చర్చించారు. 42అభివృద్ధి పనులకు రూ.98,27,129 అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించి ఆమోదం తెలిపారు. ఇందులో టైడ్ గ్రాంట్ (40శాతం) రూ.58,96,277, అన్‌టైడ్ గ్రాంట్ (90శాతం పనులు) రూ.35,37,768, ఆన్‌టైడ్ గ్రాంట్ (10శాతం) రూ.3,93,084లుగా నిర్ణయించి మొత్తం రూ.98,27,129 నిధులు ఖర్చు చేసేలా ప్రణాళిక ఆమోదించారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారెపల్లి సుధీర్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ మార్గదర్శకంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి సాధించాయన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్ రావు, జెడ్పీటీసీ సభ్యులు, కమిటీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎం.సుధీర్ కుమార్

అకాల వర్షం.. అపార నష్టం



కమలాపూర్ మండలంలో మొక్కజొన్న చేనును పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



కమలాపూర్ మండలంలో దెబ్బతిన్న వరి చేను

- విడవని వర్షం... వడగళ్ల బీభత్సం...
- కలెక్టర్లు సహా పంట అంచనాల్లో నిమగ్నం

సాక్షిప్రతినిధి, వరంగల్: అకాల వర్షాలు, వడగళ్లు ఉమ్మడి జిల్లా రైతన్నలను అతలాకుతలం చేశాయి. ఓవైపు కోతకొచ్చిన వరి, మొక్కజొన్న నేల వాలుతుండగా, మరోవైపు కోసి కుప్పలు పోసిన వడ్లు, మక్కలు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం కొనుగోళ్ల అలస్యం కావడం వల్ల జిల్లాలో తెరిచిన సెంటర్లలో వడ్ల రాశులు పేరుకుపోతున్నాయి. వాన, వరద నుంచి ధాన్యం కాపాడుకునేందుకు రైతులు తిప్పలు పడుతున్నా.. సరిపడా టార్పాలిన్లు అందుబాటులో లేక మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు కళ్లముందే ధాన్యం కొట్టుకుపోతున్నా ఏం చేయలేని పరిస్థితి.

కుండపోత వర్షం.. వడగళ్లతో నష్టం...

మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షంతో చెట్లు విరిగిపోగా, విద్యుత్తు స్తంభాలు నెలకొరిగి 21 గ్రామాలకు తెల్లవారే వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. హనుమకొండ జిల్లాలో అత్యధికంగా 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.పంట నష్టం అంచనాకు సీఎస్ శాంతకుమారి ఆదేశాల మేరకు కలెక్టర్లు రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులతో కమిటీలు వేశారు. ఉమ్మడి వరంగల్‌లో 75,603 ఎకరాల్లో వివిధ పంటలు నష్టపోయినట్లు ప్రాథమిక అంచనా కాగా,లక్షన్నర ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయని, అందులో 90 శాతం వరి ఉంటుందని రైతులు,రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. బుధవారం హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులతో కలిసి జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

జిల్లాల వారీగా పంట నష్టం అంచనా (ఎకరాల్లో)

జిల్లా	పంటనష్టం
హనుమకొండ	22,721
వరంగల్	12,538
జేఎస్ భూపాలపల్లి	1,505
ములుగు	1,085
జనగామ	24,987
మహబూబాబాద్	12,767

ఉత్సాహంగా 'పీపుల్స్ మార్చ్'

మడికొండ, ధర్మసాగర్‌లలో కొనసాగిన భట్టి పాదయాత్ర

- రైల్వే జేఏసీ నాయకుల వినతిపత్రం అందజేత
- గౌడ కార్మికుడి సమస్యలు తెలుసుకున్న భట్టి విక్రమార్క
- తడిసిన ధాన్యం పరిశీలన.. అండగా ఉంటామని హామీ





భట్టి విక్రమార్కను కలిసిన రైల్వే జేఏసీ నాయకులు, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న భట్టి..

మడికొండ/ధర్మసాగర్: సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర హనుమకొండ జిల్లాలో ఉత్సాహంగా సాగుతోంది. మంగళవారం రాత్రి మడికొండలో బస చేసిన భట్టి బుధవారం ఉదయం 8 నుంచి 10గంటల వరకు ప్రజలను, కార్యకర్తలను కలుసుకున్నారు. కాజీపేట రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కోకన్వీనర్లు అనుముల శ్రీనివాసు, జీ.భాస్కర్, ఎంకే.మూర్తి, ఎస్.లక్ష్మీనారాయణలు భట్టి విక్రమార్కను కలిసి మెమోరాండం అందజేశారు. కాజీపేట వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్, వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమకు 160 ఎకరాలకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 150 ఎకరాల భూమి మాత్రమే రైల్వేకు అప్పగించిందని, మరో 10 ఎకరాల భూమిని ఇవ్వకపోవడంతో పరిశ్రమ నిర్మాణం ప్రారంభం కావడం లేదని తెలిపారు. దీనిపై భట్టి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కావాలని నాటకాలు ఆడుతూ రైల్వే పరిశ్రమపై నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదేళ్లుగా భూమి అప్పగించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

మధ్యాహ్నం..

మడికొండలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన ఆయన పాదయాత్రగా మధ్యాహ్నం వరకు ధర్మసాగర్ చేరుకున్నారు. ధర్మసాగర్‌లోని కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ముప్పారం మీదుగా నారాయణగిరికి చేరుకున్నారు. మార్గమధ్యలో పలువురు రైతులు, కూలీలతో మాట్లాడుతూ ముందుకు సాగారు. అంతకుముందు ధర్మసాగర్‌లో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 54శాతం ఉన్న బీసీల అభ్యున్నతి కోసం సబ్‌ప్లాన్ చట్టం తీసుకువచ్చి బీసీబంధు పథకం తీసుకువచ్చే ఆలోచన చేస్తామన్నారు. కేజీ టు పీజీ వరకు ఉచిత నిర్బంధ విద్యను అందిస్తామని, పేదలకు ఆరోగ్య శ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మొట్టమొదటిగా గెలిచేది స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గమేనని చెప్పారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆనాడు దేవాదుల ప్రాజెక్ట్ పనులు ప్రారంభించి ధర్మసాగర్ రిజర్వాయర్‌లో నీళ్లు పోయించారన్నారు. తెలంగాణలో పేదల బతుకులు మారలేదు కానీ బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, నాయకులు దొమ్మాటి సాంబయ్య, ఎర్రబెల్లి స్వర్ణ, బంధ్రు శోభారాణి, గండ్ర సత్యనారాయణ, కూచన రవళి, తొట్ల రాజు యాదవ్, గంగారపు అమృతరావు, జగదీశ్‌రెడ్డి, గుర్రం అమర్‌నాథ్, వారల వెంకన్న, పెండ్లి కృష్ణమూర్తి, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, నాగరాజు, నీలం వేణు రజిని, కీసర దిలీప్‌రెడ్డి, గుర్రపు ప్రసాద్, ఎంపీటీసీలు రొండి రాజు, జాలిగపు వనమాల, బొడ్డు లెనిన్, జాలిగపు దుర్గయ్య పాల్గొన్నారు.

మీలో మీరు తిట్టుకోకుండా ప్రజలకు ఉపయోగపడే పథకాలు పెట్టండి

- భట్టి విక్రమార్కకు ఓ గీతకార్మికుడి సూచన

పాదయాత్రలో భాగంగా మడికొండ గ్రామానికి చెందిన గీతకార్మికుడు బైరి నాగరాజును.. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పలకరించారు. 'రాజకీయ నాయకులు మీలో మీరు తిట్టుకోవడం కాకుండా ప్రజలకు ఉపయోగకరమైన పథకాలను ప్రవేశపెట్టండి. చదువుకునే పిల్లలకు ఉచిత విద్య అందించేలా చర్యలు తీసుకోవాలి. పైచదువుల వారికి ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసేలా చూడండి'అంటూ నాగరాజు.. భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కకు తాటి ముంజలను అందజేశాడు.



పాదయాత్రలో భట్టి విక్రమార్కకు ముంజలు అందిస్తున్న గౌడ కార్మికుడు నాగరాజు

రిజిస్ట్రేషన్లకు మొరాయించిన సర్వర్

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్వో కార్యాలయంలో భూక్రయవిక్రయదారులకు బుధవారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో సర్వర్ మొరాయించడంతో తిప్పలు తప్పలేదు. ఆన్‌లైన్‌లో తలెత్తిన సాంకేతిక లోపం మధ్యాహ్నం రెండుగంటల వరకు కొనసాగింది. ఆ తర్వాత రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. సాధారణంగా రోజూ 120నుంచి 150 వరకు దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుంటుండగా బుధవారం సర్వర్ మొరాయించడంతో సాయంత్రం ఏడు గంటల వరకు 86దస్తావేజులు రిజిస్ట్రేషన్ అయ్యాయి.

డ్రెయినేజీల్లో చెత్త తీశారు

- సాక్షి కథనానికి స్పందించిన బల్దియా అధికారులు

ఖిలా వరంగల్: వరంగల్ 34,39 డివిజన్ల పరిధి శివనగర్, శాకరాశికుంటలోని అంతర్గత కాలనీల్లో ప్రధాన డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎట్టకేలకు తొలగించారు. నగరంలోని డ్రెయినేజీల పరిస్థితిపై సాక్షి దినపత్రికలో 'చెత్తతీయరు.. మురుగు పారదు' శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, బల్దియా అధికారులు స్పందించారు. బుధవారం ఉదయం వారు ఆయా కాలనీల్లోని డ్రెయినేజీలను పరిశీలించారు. జవాన్ల పర్యవేక్షణలో పారిశుద్ధ్య సిబ్బంది గ్యాంగ్ వర్క్ పెట్టి డ్రెయినేజీలను శుభ్రం చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి స్పందన



డ్రెయినేజీలో చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

క్లుప్తంగా

భార్యకు అబార్షన్ చేశారని ఆందోళన

రామన్నపేట: తనకు తెలియకుండా తన భార్యకు అబార్షన్ చేశారని భర్త బుధవారం వరంగల్‌లోని క్యూర్ వెల్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశాడు. ఖిలావరంగల్ ప్రియతో కరీమాబాద్‌కు చెందిన అరవింద్‌కు వివాహం జరిగింది. ఈక్రమంలో ప్రియ గర్భం దాల్చింది. మూడ్రోజుల క్రితం అనారోగ్య పరిస్థితుల నేపథ్యంలో క్యూర్‌వెల్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యింది. వైద్యురాలు హేమ పూర్తిస్థాయిలో పరీక్షించి ప్రియను 20 వారాల గర్భవతిగా గుర్తించింది. గర్భస్రావంలోని పిండం బయటకు వచ్చే పరిస్థితులున్న నేపథ్యంలో పిండాన్ని తొలగించారు. కాగా.. తనకు తెలియకుండానే అబార్షన్ చేశారని అరవింద్, అతడి కుటుంబీకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. అరవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

సీపీఐ నాయకులపై కేసు

వరంగల్ క్రైం: అక్రమంగా ప్రైవేట్ వ్యక్తుల భూములను ఆక్రమించినందుకు సీపీఐ నాయకులు బస్సు రవీందర్, కండే నరసయ్య, జన్ను రమేశ్, ఎండి అంజాద్‌పాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ జీ తెలిపారు. పెద్దమ్మగడ్డ శివారు నిమ్మయి చెరువు దగ్గరలో పట్టాదారుల భూముల్లో గుడిసెలు వేసి తొలగించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినపప్పటికీ లెక్క చేయకుండా వ్యవహరించడంతో పాటు రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు రేకులపల్లి చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్: కేయూ పరిధి డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ బీఏ(ఎల్) కోర్సుల నాలుగో, ఆరో సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్ షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ విడుదల చేశారు. ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 18, 20, 23, 25, 30, జూన్ 1, 3, 6, 8, 12, 14, 15, 16, 17, 19 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 19, 22, 24, 29, 31, జూన్ 2, 5, 7, 9, 13 తేదీల్లో నిర్వహిస్తారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్: జిల్లాలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిక్ హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ (డీహెచ్ఈడబ్ల్యూ)లో కాంట్రాక్ట్ పద్ధతిలో 2026 మార్చి వరకు పనిచేసేందుకు ఆసక్తి గల మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాచర్ల శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకనావిక్స్, బ్యాంకింగ్ రంగాల్లో డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణత కలిగిన మహిళలు మాత్రమే అర్హులని, దరఖాస్తులను మే 7లోపు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఈనెల 15న కాజీపేట పట్టణంలో ద్విచక్రవాహనాలు నడుపుతూ పట్టుబడిన 8 మంది బాలల్ని పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి రెండ్రోజులు జువైనల్ హోమ్‌కు తరలించాలని తీర్పునిచ్చారు.

ఈనెల 21న కాజీపేట పట్టణంలో వాహనాల తనిఖీల్లో ఏడుగురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చి జువైనల్ హోమ్‌కు తరలించారు.

మైనర్‌కు బండి.. 'మేజర్' మిస్టేక్

పిల్లలకు వాహనాలిస్తే జైలుకే..
- లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరం
- కమిషనరేట్‌లో 91 మంది జువైనల్ హోమ్‌కు
- మూడు నెలల్లో వందకు పైగా కేసులు నమోదు

ఫ్రెండు వాళ్లింటికెళ్లొస్తానని.. కూరగాయలు తీసుకొస్తానని అడిగినా.. లేదా మీరే మరేదో పని అప్పజెప్పి పిల్లలకు వాహనాలిస్తున్నారా? అయితే జాగ్రత్త.. మీరూ ఊచలెక్కపెడతారు. వరంగల్ కమిషనరేట్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనల్ని పక్కాగా అమలు చేస్తున్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే ఏ1గా వాహన యజమానిని, ఏ2గా పట్టుబడిన మైనర్‌ను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు.

- వరంగల్ క్రైం


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు(ఫైల్)

పిల్లల సంతోషం, సరదా కోసం వాహనాలిస్తున్న తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పవు. మైనర్లు వాహనాలు నడుపుతూ రోడ్డెక్కితే వరంగల్ కమిషనరేట్ పోలీసులు కేసులు నమోదు చేసి జువైనల్ హోమ్‌కు తరలిస్తున్నారు. ఈడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు సుమారు 144 మంది మైనర్లపై కేసులు నమోదు చేశారు. అందులో 91 మందిని ఇప్పటికే అరెస్ట్ చేసి జువైనల్ హోమ్‌కు తరలించారు. మరో 53 మందిని అరెస్ట్ చేసి జువైనల్ హోమ్‌కు తరలించే పనిలో పోలీసులు ఉన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 20 శాతం ప్రమాదాలు మైనర్లు వాహనాలు స్పీడ్‌గా, అజాగ్రత్తగా నడపడం కారణంగా జరిగినట్లు పోలీసు అధికారుల సమీక్షలో తేటతెల్లమైంది. వేసవి సెలవుల్లో మైనర్లు వాహనాలు నేర్చుకోవాలని, పూర్తిగా నేర్చుకోకముందే రోడ్డెక్కి రైడింగ్ చేయాలనే ఆలోచనతో తల్లిదండ్రులపై ఒత్తిడి తేచ్చే అవకాశం ఉంది. కానీ పిల్లల ఒత్తిడికి లోనై వాహనాలను వారి చేతికిస్తే వారి భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశం ఉంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో మైనర్లు ఎక్కువ మంది ఉండడం దురదృష్టకరం. ప్రమాదంలో గాయపడిన ఇతరులకు కూడా తీవ్ర నష్టం కలుగుతుంది. ప్రమాదాల కారణంగా పలు కుటుంబాల్లో చీకట్లు అలుముకుంటున్నాయి.

లైసెన్స్ లేకుండా రోడ్డెక్కితే ప్రమాదమే..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్డెక్కిన మైనర్లు హనుమకొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈఏడాది 43 మంది పట్టుబడ్డారు. వరంగల్‌లో 69 మంది పట్టుబడగా.. కాజీపేటలో 32 మందిపై కేసులు నమోదయ్యాయి. ఇందులో 91 మందిని అరెస్ట్ చేసి జువైనల్ హోమ్‌కు తరలించారు. మరో 53 మంది అరెస్ట్ కావాల్సి ఉంది. దీంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్డెక్కిన 1,755 మందికి రూ.1,25,02,700 జరిమానా విధించారు. గతేడాది కమిషనరేట్ పరిధిలో నమోదైన మైనర్ డ్రైవింగ్ కేసులు హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 209 కేసులు నమోదు కాగా.. రూ.1,04,500 జరిమానా విధించారు. వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 280 కేసులకు రూ.1,40,000, కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 305 కేసులకు రూ.1,52,500 జరిమానా విధించారు. మొత్తం 794 కేసులు నమోదు కాగా.. వాటికి రూ. 3,97,000 జరిమానా విధించారు.

పిల్లలు అడిగినా వాహనాలివ్వొద్దు..

పిల్లలపై తల్లిదండ్రులకు ఉన్న అమితమైన ప్రేమ కారణంగా పిల్లలు అడిగిన వెంటనే తల్లిదండ్రులు వారికి బండ్లు ఇస్తున్నారు. దీని వల్ల వారు తెలిసీ తెలియని వయసులో ఎమోషన్స్‌తో స్పీడ్‌ను థ్రిల్‌గా భావించి ప్రమాదాలకు కారణమై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మైనర్లకు వాహనాలిచ్చిన తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తాం. వాహనాల ఓనర్ ఏ1గా ఉంటే.. మైనర్ ఏ2గా ఉంటాడు. వేసవి సెలవుల్లో ట్రాఫిక్ పోలీసులు అడుగడుగునా వాహనాలు తనిఖీలు చేస్తారు. పట్టుబడితే శిక్ష తప్పదు.

- ఏవీ.రంగనాథ్, సీపీ

మైనర్ డ్రైవింగ్ కేసుల వివరాలు జనవరి 1నుంచి ఏప్రిల్ 24 వరకు

పోలీస్‌స్టేషన్	కేసులు	జువైనల్ హోమ్‌కు వెళ్లినవారు	పెండింగ్
హనుమకొండ	43	30	13
వరంగల్	69	40	29
కాజీపేట	32	21	11
మొత్తం	144	91	53

డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులు జనవరి 1 నుంచి ఏప్రిల్ 24 వరకు

స్టేషన్	కేసులు	జరిమానా	పెండింగ్ కేసులు
హనుమకొండ	624	రూ.5,84,400	195
వరంగల్	642	రూ.4,87,270	213
కాజీపేట	489	రూ.1,78,600	178
మొత్తం	1755	రూ.12,50,270	586

గతేడాది మైనర్ డ్రైవింగ్ కేసులు

పోలీస్ స్టేషన్	కేసులు	జరిమానా
హనుమకొండ	209	రూ.1,04,500
వరంగల్	280	రూ.1,40,000
కాజీపేట	305	రూ.1,52,500
మొత్తం	794	రూ.3,97,000

పరదా కప్పలేదన్నందుకు ప్రాణం తీసుకుంది!

ఎల్కతుర్తి: 'వర్షం పడింది. పరదా ఎందుకు కప్పలేదు. ధాన్యమంతా తడిసిపోయింది' అని భర్త మందలించడంతో మండలంలోని దామెర గ్రామానికి చెందిన ఆవుల ఎల్లమ్మ(45) బుధవారం ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వడ్లు తడిసిపోయాయి. పరదా ఎందుకు కప్పలేదు అని ఎల్లమ్మను సమ్మయ్య మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ఎల్లమ్మ ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు ఆమెను 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్సై జక్కుల పరమేశ్ కేసు నమోదు చేసుకున్నారు.



రైల్వే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బద్దియ్య



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డిప్యూటీ కన్‌స్ట్రక్షన్ కార్యాలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా బద్దియ్య అజ్మీర (ఐఆర్‌ఎస్‌ఈ)ను సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారులు నియమించారు. కాజీపేట రైల్వే కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈఎన్)గా పనిచేస్తున్న బద్దియ్య అజ్మీరను రైల్వే ఉన్నతాధికారులు ఈఈగా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడే నియమించారు.

ఈనెల 30 వరకు మూసివేత

కాజీపేట సబ్ డివిజన్ పరిధి కోమటిపల్లి రైల్వే గేట్ నంబర్–2ను ఈనెల 30 వరకు మూసివేస్తున్నట్లు బుధవారం రైల్వే అధికారులు తెలిపారు. కోమటిపల్లి రైల్వే గేట్ రెండు వైపులా డ్రెయినేజీ మరమ్మతు పనుల కారణంగా ఈగేట్‌ను మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. వేరే దారిమీదుగా ప్రజలు రాకపోకలు చేసి రైల్వేకు సహకరించాలని వారు కోరారు.

రెండో రోజు కనిపించని ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం

- సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన సంఘాల నేతలు
- మొదటి రోజు సమ్మె చేసిన 48 మంది టర్మినేషన్

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండోరోజు మంగళవారం విద్యుత్ ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం ఏమాత్రం కనిపించలేదు. పైగా తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్, ఇత్తెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సమ్మెను విరమిస్తున్నట్లు హైదరాబాద్‌లో ప్రకటించారు. కాగా.. టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో మొదటిరోజు సమ్మెలో పాల్గొన్న 48 మందిని టర్మినేట్ చేశారు. ఎస్మా భయంతో పాటు ఆర్టిజన్లు వివిధ ప్రధాన సంఘాల్లో ఉండడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సమ్మెకు వెళ్లేందుకు ఆర్టిజన్లు ముందుకు రాలేదు. వివిధ కారణాలతో రెండ్రోజుల్లోనే సమ్మె ముగిసింది.

పాము కాటుతో రైతు మృతి

ఎల్కతుర్తి: పాము కాటుతో మండలంలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన రైతు జక్కుల రాజయ్య(52) బుధవారం మృతి చెందాడు. రాజయ్య తన ఇంటికి కొద్ది దూరంలో మక్క ధాన్యం ఆరబోశాడు. మంగళవారం కురిసిన వర్షానికి కంకిని కుప్పనూర్చి వాటిపై పరదా కప్పి వెళ్లాడు. మరుసటి రోజు బుధవారం వచ్చి కంకిపై కప్పిన పరదాను తీస్తున్న క్రమంలో పరదలోంచి వచ్చిన నాగుపాము రైతును కాటేసింది. రైతు పాము కరిచిందని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాజయ్యను 108లో ఎంజీఎంకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో ఆయన మృతి చెందాడు. రాజయ్య భార్య కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.

రైల్లోంచి జారి పడి యువకుడు..

కాజీపేట రూరల్: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా జగన్నాథపురం గ్రామానికి చెందిన ముంగర శివనాగు(21) మృతి చెందాడు. కాజీపేట జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్.పరుశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. శివనాగు (21) కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో అంప్రెంటీస్ ట్రైనీగా గతేడాది జూన్ నుంచి పని చేస్తున్నాడు. మంగళవారం రాజమండ్రిలో రాజమండ్రి–కాజీపేటకు టికెట్ తీసుకుని విశాఖపట్నం–కాచిగూడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. కాజీపేట–పెండ్యాల మధ్య ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారి పడి అక్కడిక్కడే మృతి చెందాడు. ఎంజీఎం ఆసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. మృతుడు శివనాగు మృతిపై ఎలక్ట్రిక్‌షెడ్ అధికారులు, రైల్వే నాయకులు, కార్మికులు, తోటీ అంప్రెంటీస్‌లు సంతాపం ప్రకటించారు.

డిజిటల్ టెక్నాలజీతో పెనుమార్పులు

- కేయూ యూజీసీ కో–ఆర్డినేటర్ ఆచార్య మల్లికార్జున్‌రెడ్డి
- ముగిసిన జాతీయ సదస్సు


మాట్లాడుతున్న మల్లికార్జున్‌రెడ్డి

కేయూ క్యాంపస్: సేవా, వ్యవసాయ పరిశ్రమల రంగాల్లో కూడా డిజిటల్ టెక్నాలజీతో పెనుమార్పులు సంభవించాయని కాకతీయ యూనివర్సిటీ యూజీసీ కో–ఆర్డినేటర్ ఆచార్య ఆర్.మల్లికార్జున్ రెడ్డి అన్నారు. హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో రెండ్రోజులుగా 'సోషల్ ఎకనామిక్ ఇంప్లికేషన్స్ ఆఫ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బుధవారం సాయంత్రం ముగిసింది. ఈముగింపు సభలో కేయూ యూజీసీ కో–ఆర్డినేటర్ ఆచార్య ఆర్.మల్లికార్జున్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసదస్సులో ఆ కళాశాల ప్రిన్సిపాల్, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ అమరవేణి, రీసోర్స్ పర్సన్‌లుగా ఆచార్యులు రవిచంద్ర, వీరయ్య, అధ్యాపకులు రాజేశ్, డాక్టర్ బైరు నిరంజన్, డాక్టర్ రవీందర్ డాక్టర్ మంజుల, డాక్టర్ రమ పాల్గొన్నారు.

మహారాష్ట్రకు మక్కలు



కాశిబుగ్గ: వరంగల్ నుంచి మహారాష్ట్రకు పెద్ద ఎత్తున మక్కలు తరలుతున్నాయి. బుధవారం వరంగల్ రైల్వే స్టేషన్ రైల్వే గూడ్స్ షెడ్డు నుంచి మహారాష్ట్రలోని నీరజ్‌కు 40 జంబో వ్యాగన్లలో పెద్ద ఎత్తున మక్కలు ఎగుమతి అయ్యాయి. గతంలో మక్కలు దిగుమతయ్యేవి. కానీ వాణిజ్య పంటలతో రైతులు నష్టపోతుండడంతో ఎక్కువ మంది రైతులు తక్కువ పెట్టుబడితో ఉండే మక్కల వైపు మళ్లారు. దీంతో ఈసారి ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలో పెద్ద ఎత్తున మక్కలు పండించారు. దీనికి తోడు ఇక్కడి మక్కలకు అధిక డిమాండ్ ఉండడంతో మహారాష్ట్ర వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లుగా తెలిసింది.

ఈవీఎంల భద్రతకు గోదాముల నిర్మాణం

- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్


సూచనలు ఇస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన జిల్లాల్లో ఈవీఎంలను భద్రపరిచేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నూతన ఈవీఎం గోదాముల నిర్మాణాన్ని చేపట్టినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. బుధవారం హనుమకొండ సుబేదారిలో నిర్మిస్తున్న ఈవీఎం గోదామును, ప్రహరీ నిర్మాణాన్ని ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల్లో ఈవీఎంలు అతి ముఖ్యమైనవని, ఎన్నికల ముందు నుంచి ఎన్నికల అనంతరం వీటిని అత్యంత జాగ్రత్తగా భద్రపరుచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వాసుచంద్ర, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ అధికారులు రాజాం, సురేష్‌బాబు పాల్గొన్నారు

రిటర్నింగ్ అధికారుల ప్రతిపాదనలు పంపాలి

హన్మకొండ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమించేందుకు ప్రతిపాదనలను పంపాలని జిల్లా కలెక్టర్‌లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజు సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవికిరణ్‌తో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజు రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం, నిర్దేశించిన నమూనాలో మూడు రోజుల్లో రిటర్నింగ్ అధికారుల ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. వీసీలో జిల్లానుంచి కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ వాసుచంద్ర, పరకాల ఆర్డీఓ రాము, తహసీల్దార్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఈసీ నిబంధనలు పాటించాలి

- ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

వరంగల్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) నిబంధనలు పకడ్బందీగా పాటిస్తూ నిర్దేశించిన పనులు పూర్తి చేయాలని ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవికిరణ్‌లతో కలిసి కలెక్టర్లతో ఓటర్ జాబితాలో ఎఫ్ఎల్‌సీ, పీఈటీ తొలగింపు, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీలో కలెక్టర్ ప్రావీణ్యతో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీవత్స కోట, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ మహేందర్‌జీలు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలి

ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతీ గ్రామ పంచాయతీలో కనీసం 100 మందికి ఉపాధి కల్పించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో పల్లెప్రగతిలోని వివిధ అంశాలపై కలెక్టర్ ఎంపీడీఓ, ఎంపీఓలతో సమీక్షించారు. సమావేశంలో డీఆర్‌డీఓ సంపత్ రావు, డీపీఓ కల్పన తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ స్టౌ రిపేర్ పేరిట చోరీలు

- క్రైం ఏసీపీ డేవిడ్‌రాజ్


నిందితుల అరెస్టు చూపుతున్న క్రైం ఏసీపీ డేవిడ్‌రాజ్

వరంగల్ క్రైం: గ్యాస్ స్టౌ మరమ్మతుల ముసుగులో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడితో పాటు చోరీ సొత్తును తాకట్టు పెట్టుకున్న మరో ఇద్దరు నిందితులను సీసీఎస్, దామెర పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.2.20 లక్షల విలువైన 21.5 గ్రాముల బంగారం, 220 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.15 వేల నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి గ్రామానికి చెందిన పర్వతం రాజు కొంతకాలంగా గ్యాస్ స్టౌ రిపేర్ చేస్తామని బైక్‌పై ఊళ్లలో తిరుగుతూ ఒంటరి మహిళలను గుర్తించేవాడు. వారికి సబ్సిడీపై గ్యాస్ ఇప్పిస్తామని, దాని కోసం ఆధార్ తీసుకురావాలని.. ఆవెంటనే మహిళలను అనుసరించేవాడు. ఇంట్లో బంగారం, వెండి చోరీకి పాల్పడి పరారయ్యేవాడు. దీంతోపాటు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి వేళల్లో ఇళ్లలో చోరీకి పాల్పడేవాడు. ఐదేళ్లుగా రాచకొండ, సైబరాబాద్, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు పాల్పడి పలుసార్లు జైలుకు వెళ్లాడు. జైలు నుంచి విడుదలైన రాజు ఈనెల 2న దామెర పోలీస్‌స్టేషన్ పరిధి కంఠాత్మకూరులో ఓ వృద్ధురాలికి గ్యాస్ స్టౌ ఇప్పిస్తానని, ఫొటో దిగాలని, మెడలో నుంచి బంగారు గొలుసు తీసేయాలని చెప్పాడు. నమ్మిన ఆమె గొలుసును అల్మారాలో పెట్టింది. ఆతర్వాత ఆమె కళ్లుగప్పి బంగారు గొలుసును తీసుకుని పారిపోయాడు. రాజు ఇలా.. వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఆరు చోరీలకు పాల్పడ్డాడు. తాళం వేసి ఉన్న ఏడు ఇళ్లలో తాళం పగులగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. పర్వతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు, ధర్మసాగర్, రాయపర్తి, పరిధిలో రెండు చొప్పున, దామెర, ఐనవోలు, దేవరుప్పుల, మామునూరు, స్టేషన్‌ఘన్‌పూర్, ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒకటి చొప్పున చోరీలకు పాల్పడ్డాడు. చోరీ సొత్తును ఆలేరు మండలం, టంగుటూరు ప్రాంతానికి చెందిన చింతకింది రాములు ద్వారా యాదాద్రి జిల్లా ఆలేరు మండల కేంద్రానికి చెందిన గోవింద్ చౌదరి వద్ద తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నాడు. గ్యాస్ స్టౌ మరమ్మతులో భాగంగా దామెరకు వచ్చిన నిందితున్ని దామెర క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకుని విచారించారు. నేరం అంగీకరించి, తాకట్టు వివరాలు చెప్పడంతో చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులను సీపీ రంగనాథ్ అభినందించినట్లు ఆయన తెలిపారు.

టీచర్ కుటుంబానికి పీఆర్టీయూ చేయూత

- రూ 9.34 లక్షలు ఆర్థికసాయం


చెక్కు అందిస్తున్న పీఆర్టీయూ నాయకులు

విద్యారణ్యపురి: కేవలం ఉపాధ్యాయుల సమస్యల సాధనే కాదు, ఉపాధ్యాయులకు వ్యక్తిగతంగా సమస్యలు, ఆపద వచ్చినా.. పీఆర్టీయూ అండగా నిలిచి చేయూతనిస్తుందని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. యూనియన్ హనుమకొండ జిల్లా నడికూడ మండల శాఖ ప్రధాన కార్యదర్శి అచ్చ సుదర్శన్ కుమారుడు నేతాజీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగి కోమాలోకి వెళ్లాడు. అతడిని రక్షించేందుకు, ఆస్పత్రి ఖర్చుల కోసం పీఆర్టీయూ టీఎస్ హనుమకొండ జిల్లా శాఖ నడికూడ, పరకాల మండల శాఖల ఆధ్వర్యంలో పీఆర్టీయూ ఉపాధ్యాయుల నుంచి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించారు. సేకరించిన మొత్తం రూ.9,34,910ను చెక్కు రూపంలో బుధవారం పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరి హనుమకొండలో బాధిత ఉపాధ్యాయుడు అచ్చ సుదర్శన్‌కు అందించారు. ఈసందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఎలాంటి కష్టం వచ్చినా పీఆర్టీయూ అండగా ఉంటుందన్నారు. గతంలో కూడా ఎంతోమంది ఉపాధ్యాయులకు ఆపద వస్తే ఆదుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరి, బాధ్యులు ఎడ్ల ఉపేందర్‌రెడ్డి, తిరుపతిరావు, ఎ.శ్రీనివాస్, బండ రమేశ్, ఆర్.భానుప్రసాద్‌రెడ్డి, గైరిశెట్టి శ్రీధర్, రాజేందర్‌బాబు, రాజ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, లక్షణాచారి ఇతర బాధ్యులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకునేదెప్పుడు?



మాట్లాడుతున్న ప్రొఫెసర్ యాదగిరిచార్యులు

వరంగల్ చౌరస్తా: అకాల వర్షాలతో రైతాంగం అతలాకుతులమైందని, ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.పదివేలను నేటికీ అందించకపోవడం విడ్డూరంగా ఉందని సామాజిక ఆర్థిక విశ్లేషకులు, ప్రొఫెసర్ ఎం.యాదగిరాచార్యులు విమర్శించారు. బుధవారం వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో అఖిల భారత రైతు సమైఖ్య (ఏఐకేఎఫ్), అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్), తెలంగాణ రైతు సంఘం, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు పూర్తిగా దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ప్రతీ రైతు ఎకరాకు పంట ఆధారంగా రూ. 10వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్, జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు, నాయకులు ఎస్ రెడ్డి హంసారెడ్డి, వివిధ రైతు ప్రజా సంఘాల నాయకులు నర్ర ప్రతాప్ కంకణాల మల్లికార్జున్ కందికొండ కుమారస్వామి గూడ సురేశ్, ఇనుముల కృష్ణ పాల్గొన్నారు.

కుక్కల చర్మవ్యాధులతో పొంచి ఉన్న ప్రమాదం

- ప్రత్యేకంగా చికిత్స అందించాలని నిపుణుల నిర్ణయం

వరంగల్ అర్బన్: కుక్కల్లో తరచూ వచ్చే చర్మవ్యాధుల వల్ల ప్రమాదం పొంచి ఉందని, నియంత్రణ కోసం ప్రత్యేకంగా చికిత్స అందించాల్సిన అవసరం ఉందని నిపుణుల బృందం తేల్చి చెప్పారు. బుధవారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయంలోని అడిషనల్ కమిషనర్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో కుక్కలకు వచ్చే చర్మవ్యాధులపై సమావేశమై చేపట్టాల్సిన చర్యలపై నిర్ణయాలు తీసుకున్నారు. ఈసందర్భంగా నిపుణుల కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కుక్కల్లో గజ్జి (మెంజ్), తామర వంటి వ్యాధులు పీన్లు (లైస్), గోమార్లు, పిడుదులు, మైట్స్ వంటి రక్తం పీల్చే బాక్టీరియా వల్ల వస్తాయని పేర్కొన్నారు. బల్దియా పరిధిలోని 66 డివిజన్‌ల వ్యాప్తంగా గజ్జి తామర వంటి వ్యాధులతో బాధపడుతున్న కుక్కలను గుర్తించి అవి తీసుకునే ఆహారంలో ఎవర్మిటిన్ మాత్రలను కలపడం ద్వారా వ్యాధులను నిర్మూలించవచ్చునని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కమిటీ నిర్ణయించారు. సమావేశంలో బల్దియా డిప్యూటీ కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్ఓ రాజేష్, వెటర్నరీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. అమృత్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్, వెటర్నరీ అధికారి గోపాల్ రావు, వరంగల్ డిస్ట్రిక్ ల్యాబ్ అధికారి నాగమణి, జిల్లా వెటర్నరీ అధికారి వెంకట నారాయణ, వెటర్నరీ ఏడిలు రవికుమార్, ఊర్మిళ పాల్గొన్నారు.